# ఉయ్యాల

రేపల్లెవాడలో నందరాజింటిలో

నెలవంక ఉదయించె .. "ఉయ్యాలా"

రారమ్మ రారే యశోదమ్మ బిడ్డను

చూచి వద్దామిపుడే .. "ఉయ్యాలా"

కన్నయ్య మెట్టిన మన పల్లెపై మల్లె

పూల వర్షము కురిసె .. "ఉయ్యాలా"

గోకులమ్మంత పరవశముతో

నాట్యాలు చేసెనే .. "ఉయ్యాలా"

పట్టు పరుపుల పైన పవ్వళించిన తండ్రి

నవ్వులే నవ్వునట .. "ఉయ్యాలా"

నవ్వుల్లలోనే ముత్యాలు రాలునట

చోద్యము చూతాము .. "ఉయ్యాలా"

ఆలమందలతో ఆటలెన్నోఆడి

అలసినాడోయమ్మ .. "ఉయ్యాలా"

పసిడిగిన్నెలలోని పాలు మీగడ పెట్టి

జోలల్లు పాడుదము .. "ఉయ్యాలా"

బ్రహ్మాది దేవతలు మన బిడ్డను చూడ

విచ్చేసినారంట .. "ఉయ్యాలా"

వైకుంఠవాసి ఆనారాయణుడే యంచు

జేజేలు పలికిరట .. "ఉయ్యాలా"

రేపల్లెవాడలో నందరాజింటిలో

నెలవంక ఉదయించె .. "ఉయ్యాలా"

--చల్లా సత్యవతి